

# పుస్తక పరిచయం




**విలక్షణమైన** పిల్లల కథా సంపుటి ఈ ‘ప్రకృతి-వికృతి‘ పుస్తకం. రచయిత మూరిశెట్టి గోవింద్‌గారు, ప్రకృతిలోని వివిధ అంశాలను ఆలోచించదగిన కోణాల్లో పిల్లలకు పరిచయం చేసే కథలివన్నీ. భూమాత, గంగానది, గోమాత, కొండలు, అడవులు.. ఇలాంటివన్నీ ఆధునిక జీవన శైలుల వల్ల ఎలా ప్రభవితమౌతున్నాయి, వాటిని ఎలా రక్షించుకోవాలీ అనే అంశాలను అతి సులభంగా, పిల్లలకు అర్థమయ్యే రీతిలో ఈ కథల్లో వివరించారు. పిల్లల మనసులకు దగ్గరవడానికి అక్కడక్కడా పౌరాణిక పాత్రలను కూడా చేర్చి సామాజిక స్పృహతో సాగిన కథలకు ఓ సరికొత్త రూపాన్నిచ్చారు రచయిత. కథా రచనా శైలి చాలా సరళంగా పిల్లలకు అతి సులువుగా అర్థమయేలా సాగింది. కథా రచయితగా గోవింద్‌గారికిది మూడవ కథా సంపుటి. లోగడ ‘సాకిరేవు కథలు‘, ‘ మా ఊరి మంగలి కథలు‘ అనే రెండు కథా సంపుటాలను ప్రచురించారు. వాటిల్లో పల్లెల సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆయా వృత్తులవారి శ్రమ జీవన సౌందర్యం, అంతరించి పోతున్న కులవృత్తులు.. ఇలాంటి అనేక అంశాలను స్పృశించారు. అలాగే ప్రస్తుత కథల సంపుటి గురించి రచయితే ముందు మాటలో ఇలా చెప్పుకున్నారు ''నానాటికీ పెరిగిపోతున్న జనాభా, రోజు రోజుకు తరిగిపోతున్న ప్రకృతి సంపద, నాగరికత పేరుతో జరుగుతున్న ప్రకృతి విధ్వంసము, పట్టణీకరణతో పేరుకుపోతున్న మానవ వ్యర్థాలు.. వీటి ద్వారా భూమి కలుషితం, గాలి కలుషితం, నీరు కలుషితం, సమస్తమూ కలుషితం. ఇప్పటికైనా మనం మేల్కొనకపోతే మానవుని మనుగడ కష్టసాధ్యమేనని తెలియచెప్పే కథలివి''. ఈ పుస్తకానికి ముందు మాట వ్రాసిన సాకం నాగరాజుగారు ''పెద్దవాళ్ళనే కాదు, బడిపిల్లల్ని గూడా కూర్చోబెట్టి బుద్ధిగా మడిజేతులు కట్టుకోమని - పాఠాలు చెప్పినట్లుగా ఈ కథల్ని చెప్పాడు'' అన్నారు. ఇందులోని 15 కథల్నీ చదివాక పాఠకులు కూడా అదే అనుభూతికి లోనౌతారు. సామాజిక బాధ్యతతో పిల్లలకోసం ఇంతమంచి కథలు వ్రాసిన రచయిత అభినందనీయులు.

★★★

మూరిశెట్టి గోవింద్
చిన్నదొరవారికండ్రిగ (గ్రామం , పోస్ట్)
కార్వేటినగరం మండలం
చిత్తూరు జిల్లా - 517582
ఫోన్: 9502200749, 9440849755



# పుస్తక పరిచయం




*For Copies :*
**K. Murali Mohan**
402, Aanand Sai Residency,
Road No. 2, KRCR Colony,
Bachupally,
Hyderabad - 500 090.

**తెలుగు భాషలో** ఈ ‘పాతిక పదచదరాలు‘ ఒక ఆసక్తికరమైన, విలక్షణమైన పుస్తకం. ఇంగ్లీషులో క్రాస్ వర్డ్ పజిల్స్ పుస్తకాలు విరివిగా లభ్యమౌతాయి కానీ, తెలుగులో అవి చాలా అరుదు. ఇంతకు ముందు తెలుగులో వచ్చిన క్రాస్ వర్డ్ పజిల్స్ కూడా ఒకే రచయిత కూర్చినవి - ఉదా: శ్రీశ్రీ ఆరుద్ర ఇలా. పదచదరం, గళ్ళ నుడికట్టు, గడి-నుడి, అక్షరకేళి, పదవినోదం.. పేరు ఏదైనా తెలుగు పత్రికల్లో తరచూ కనిపించేవి ఈ క్రాస్ వర్డ్ పజిల్స్. పత్రికను చదివి పక్కన పడెయ్యకుండా ఆపగలిగేవి ఈ పదచదరాలు. ఇలాంటి పదచదరాలను పూరించడం వల్ల కలిగే ఉపయోగాలను ముందుమాటలో చాలా విశదంగా తెలియచేశారు - ఈ పుస్తకం సంపాదకుడు కోడీహళ్ళి మురళీమోహన్ గారు. వీటిని పూరించడం వల్ల మెదడుకు పదును పెరగడమే కాక, జ్ఞాపకశక్తి పెరుగుతుంది, తెలుగు భాషా పరిజ్ఞానం పెరుగుతుంది, అన్నింటికీ మించి సరిగ్గా పూర్తిచేస్తే కలిగే ఆత్మవిశ్వాసం..! ఇన్ని ఉపయోగాలున్నాయి ఈ పదచదరాల వల్ల. ఈ పుస్తకం ప్రత్యేకత - ఇందులోని పాతిక పదచదరాలను పాతికమంది ప్రముఖులు నిర్మించడం. సాధారణంగా ఇలాంటి పదచదరాలను కూర్చేటప్పుడు తాను ఎన్నుకున్న పదాలని బట్టి కూర్పరి తెలుపు, నలుపు గళ్ళను ఎంచుకోవచ్చు, ఐతే ఈ పుస్తకంలోని పజిల్స్‌లో ఇంకొక సవాల్ ఏమిటంటే అన్నింటిలోనూ ఏకరీతి చదరాలున్నాయి. అంటే ముందుగానే తెలుపు, నలుపు గళ్ళను ఇలాగే ఉండాలని నిర్దేశించి, కూర్పరులకు ఇచ్చారు. ఇది కూడా ఈ పదచదరాల్లోని అత్యంత ఆసక్తికరమైన అంశం. ఈ పాతిక పదచదరాలను రూపొందించిన ప్రముఖుల్లో కొంతమంది - సుధామ, భైరవభట్ల కామేశ్వరరావు, సుభద్రవేదుల, అరిపిరాల సత్యప్రసాద్.. మొదలైన వారు. మంచి నవలలూ, కథలూ ఎంత ఆసక్తికరంగా చదివిస్తాయో, ఈ పదచదరాలు కూడా అంత ఆసక్తికరంగా పాఠకులను అలరిస్తాయి. ఈ వినూత్నమైన ప్రయోగానికి గ్రంథరూపమిచ్చిన మురళీమోహన్ గారు అభినందనీయులు.

★★★

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా ‘కౌముది‘ విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**